**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

మనిషి ఆశతోడ మనుగడ సాగించు
నచ్చినట్టి పనులు నాటవిడుపు
అవసరమున మనిషి అణిగి అన్నియు నేర్చు
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్)
& చైతన్య గళం ధానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక 16 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | జూలై 15, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో
# విమానాశ్రయాల నిర్మాణం

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణచేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,జులై 14 :** తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్నవరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతోనిర్మించాలని పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్య పరంగా వరంగల్, ఆది లాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరి స్థితులను సీఎం వివరించారు. మిగతా2లో...

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు
# ప్రారంభించాలి..

## ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు

● రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి ● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**న్యూఢిల్లీ,జులై 14 :** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుందుని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ మిగతా2లో...

## ఎన్యూమరేషన్ ఫారాలను
# అందజేయండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




**హైదరాబాద్,జులై 14 :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా అందజేసిన ఎన్యూరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బిఎల్‌ఒలకు వెంటనే మిగతా2లో...

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!



**అమరావతి,జులై 14 :**ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైకాపా సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం కాపు ఉద్యమంతో ప్రసిద్ధి చెందిన ముద్రగడ పద్మనాభం ఇకలేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 73 ఏళ్ల వయసులో అందర్నీ విషాదంలో మిగతా2లో...

## నాణ్యమైన, నిరంతరాయ
# విద్యుత్ సరఫరా

- రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాలు
- ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో ఉప కేంద్రం నిర్మాణం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



2లో

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

- హోం టూర్ వీడియోల హల్ చల్
- ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం-
- ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి



2లో



## ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా
# పంటల ప్రణాళిక

**మెట్ట పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్,జులై 14 :**ఈ రోజు నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో మిగతా2లో...

## ఊరూరా బిఆర్ఎస్
# కుట్రలపై ప్రచారం

- కెసిఆర్ హాయంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణలు సూచనల మేరకు నీటి విడుదల
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**హైదరాబాద్,జులై 14 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి మిగతా2లో...



## ఆషాఢ బోనాలకు
# భారీగా ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బంది లేకుండా భద్రతా చర్యలు
- నగర పోలీస్ అధికారులతో సజ్జనార్ సమీక్ష

**హైదరాబాద్,జులై 14 :** ఆషాడ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాడ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జన్నార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై మిగతా2లో...

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం లోమంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగావరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమైఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతరపరిశ్రమలతో వరంగల్కీలకనగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. ఉత్తరతెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండజిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దంపట్టేలా డిజైన్లు ఉండాలనిభావిస్తున్న ట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణశాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయంనిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణసంస్థలు (ఈ-ుక్ష)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైనప్రతిపాదనలుసమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలోనల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వసలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీకె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీకోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలుకీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకుసహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా

**మహబూబ్‌నగర్,జులై 14 :** నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో పరిస్థితులకనుగుణంగా పంటల ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలుస్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్తాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొ న్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబం ధించిన నిపుణులు రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

### ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం

### ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష



**హైదరాబాద్,జులై 14** భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు.

# మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇకలేరు..!

(మొదటి పేజీ తరువాయి)

ముంచుతూ ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ.. తండ్రి వీర రాఘవరావు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 1978లో జనతా పార్టీ ఎమ్మెల్యేగా ముద్రగడ తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మంత్రిగా సేవలందించారు.కన్నుమూశారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ముద్రగడ మంగళవారం సాయంత్రం ప్రాణాలు విడిచారు. హైదరాబాద్ సింధు ఆస్పత్రిలో శ్వాసకోస సమస్యకు చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో ముద్రగడ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో ఏపీలో విషాదం నెలకొంది.

# ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి..

(మొదటి పేజీ తరువాయి)

శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

**హైదరాబాద్,జులై 14 :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మభ్య పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

# ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరఫున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు.

గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని నగర సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయండి

(మొదటి పేజీ తరువాయి)

అందజేసి మీ యొక్క అమూల్యమైన ఓటుహక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బిఎల్ఒలు అందజేసిన ఫారాల్లో ఎలాంటి తప్పులు లేకుండా పూరించి, ఫోటోలను అతికించి బిఎల్ఒలకు అందించాలని సిఇఒ కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటర్ సంతకం, తేదీతో పాటు బిఎల్ఒల సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిఎల్ఒలు ఓటర్లకు అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బిఎల్ఒలకు ఇవ్వాలని, మరొకటి ఓటర్ భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్ఒలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో ఓటరు పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటర్ వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అటువంటి వివరాలను లేకపోయిన ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఒలకు అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సమర్పించారు. సర్ పక్రియ జూన్ 25 నాడు ప్రారంభమైందని, మరో పది రోజుల్లో ఈ పక్రియ ముగుస్తుందని, ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే బిఎల్ఒలకు అందజేయాలని సూచించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
బుధవారం, జూలై 15, 2026


# శాతవాహన విశ్వవిద్యాలయంలో ట్యాలీ శిక్షణా సదస్సు



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి కార్యశాల ప్రారంభమైంది. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ యూజింగ్ ట్యాలీ ఈఆర్పీ 9 పేరుతో జూలై 14 నుంచి 16 వరకు జరిగే ఈ శిక్షణలో విద్యార్థులకు కంపెనీ క్రియేషన్, లెడ్జర్ నిర్వహణ, వౌచర్ ఎంట్రీ, జీఎస్టీ అకౌంటింగ్, ఇన్వెంటరీ, పేరోల్, బ్యాంకింగ్, ఆర్థిక నివేదికలు, డేటా భద్రతపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక వ్యాపార రంగంలో అకౌంటింగ్ విధానాలు వేగంగా మారుతున్నాయని, విద్యార్థులు ట్యాలీ వంటి సాంకేతికతలను నేర్చుకోవడం తప్పనిసరి అని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ మాట్లాడుతూ ట్యాలీ సాఫ్ట్‌వేర్‌ను త్వరలోనే విశ్వవిద్యాలయ అకౌంట్స్ విభాగంలో అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు, ఉద్యోగ సామర్థ్యాలను పెంపొందించడమే అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ లక్ష్యమని వివరించారు. విభాగాధిపతి డాక్టర్ డి. హరిక ాంత్ మాట్లాడుతూ వాణిజ్యశాస్త్ర విద్యార్థులకు మరిన్ని శిక్షణా కార్యక్రమాలు, కామర్స్ స్టూడె ంట్స్ మీట్ నిర్వహించేందుకు ప్రణాళికలు ఉన్న ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యా పకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# కేజీబీవీ బాలికలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

■ కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని అన్ని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థినులకు విద్య, భోజనం, వసతి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. మంగళవారం రాఘవాపూర్ గ్రామంలోని కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పప్పు నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు అందించే ప్రతి వంటకం రుచికరంగా, నాణ్యతతో ఉండాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన ఆమె, ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు సరుకులను విద్యార్థుల హాజరు ప్రకారం పంపిణీ చేసి వెంటనే నమోదు చేయాలని సూచించారు. విద్యాలయంలో బాత్రూమ్ మరమ్మతులు, గ్యాస్ కొరత, విద్యుత్ సమస్య, కోతుల బెడద వంటి అంశాలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తల్లిదండ్రులను విడిచి హాస్టళ్లలో ఉంటున్న బాలికలకు భరోసా కల్పిస్తూ, విద్య, భోజనం, వసతి విషయంలో ఎలాంటి లోటు లేకుండా బాధ్యతగా చూసుకోవాలని కలెక్టర్ ఉపాధ్యాయులు, స్పెషల్ అధికారులను ఆదేశించారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంకై ధర్నా

**పెద్దపల్లి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ధర్నా సెంటర్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండవేణి జగన్ మాట్లాడుతూ, పిఆర్సీ వెంటనే ప్రకటించి 51% ఫిట్‌మెంట్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 6 డిఏలు, బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం హామీలను అమలు చేయకపోవడం వల్ల ఉద్యమం తప్పదని అన్నారు. కేజీబీవీ, ఎస్-ఎస్ఏ మహిళా ఉపాధ్యాయుల సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని, ఎంటిఎస్ అమలు చేయాలని, 2003 డీఎస్సీ వారికి ఓపిఎస్ అమలు చేసి, సుప్రీంకోర్టులో వేసిన ఎస్ఎల్పీని వెనక్కి తీసుకోవాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, గురుకుల, ఆశ్రమ, ఎయిడెడ్ పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కోసం గ్రాంట్లు విడుదల చేసి, ఉపాధ్యాయుల ప్రమోషన్, ట్రాన్స్ఫర్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 1న రాష్ట్రవ్యాప్తంగా మహా ధర్నా




చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముసుకుల సునీల్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు ఎలగం కనకయ్య, జైపాల్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు విజయేంధర్ రెడ్డి, మహిళా నాయకురాలు మంజులత, వివిధ మండలాల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏఓకి వినతిపత్రం అందజేశారు.

# సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ విమర్శించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటి ముట్టడి కార్యక్రమం అనంతరం అరెస్టయిన ఆయన మాట్లాడుతూ, సంక్షేమ రంగానికి న్యాయం చేయలేకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 5 స్టార్ భోజనం హామీ అమలు కాలేదని, అనేక హాస్టళ్లు అద్దె భవనాల్లో కనీస వసతులు లేకుండా కొనసాగుతున్నాయని తెలిపారు. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొత్త హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున



ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, సహాయ కార్యదర్శి భోగేశ్వర్, కమిటీ సభ్యులు రత్నం సురేష్, రోహిత్, నరేష్, మానస, జాన్సన్, సిద్ధు, రాహుల్, రిషి, అభి, అర్ఫాన్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుకు శాశ్వత భవనం, రెగ్యులర్ జడ్జి నియామకం కోరుతూ వినతిపత్రం అందజేత

**ఖానాపూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ కోర్టుకు శాశ్వత భవనం నిర్మాణం చేపట్టాలని, రెగ్యులర్ జడ్జిని నియమించాలని కోరుతూ ఖానాపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల బృందం హైకోర్టులో నిర్మల్ జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి కె. సుజనను కలిసి వినతిపత్రం సమర్పించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో, కోర్టు భవన నిర్మాణానికి ఇప్పటికే 5 ఎకరాల భూమి మంజూరైనందున నిర్మాణం జరిగేలా సహకారం



అందిస్తానని న్యాయమూర్తి హామీ ఇచ్చారు. తరువాత నూతనంగా ఎన్నికైన హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డిని కలిసి సన్మానించారు. ఆయన ఎన్నిక మన ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు గర్వకారణమని బార్ అసోసియేషన్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వెంకట్ మహేంద్ర, బక్కశెట్టి కిషోర్, రాజురా సత్యం, అసిఫ్ ఆలీ, బాసెట్టి శివ, సురేందర్, ఐదు వెంకటేష్, నరేంద్రనాథ్, ఖదీర్, రాసముల్ల అశోక్, కమలాకర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఏబీవీపీ బంద్





**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివే యాలనే ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టేందుకు ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ మోడల్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతులను బహిష్కరించి విద్యార్థులు బంద్‌లో పాల్గొన్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయిం బర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకుంటున్నారని, కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 11,000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని విమర్శి ంచారు. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యా ర్థులు డిటెండ్ అవుతున్నారని, ప్రైవేట్ కాలేజీలు మూతపడుతున్నాయని, నిరుద్యోగ లెక్చరర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల హక్కు అని, ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన గ్రీన్ ఛానెల్ అమలు చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కరి ంచకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చరణ్, నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, సంయుక్త కార్యదర్శి రంజిత్, మహిళా కన్వీనర్ శిరీష, అశ్విని, ప్రసన్న, శరత్ కుమార్, శ్రావణ్, రామ్ చరణ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ ప్రవేశ పరీక్షపై అధికారులు దృష్టి సారించాలి
## అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని ప్రతి ఐదో తరగతి విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష రాయాలని అధికారులు కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. చొప్పదండి నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే జేఎన్‌వీఎస్‌టీ--2027 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సుమారు 11 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారందరూ దరఖాస్తు చేసుకునేలా విద్యాశాఖ, మున్సిపల్ కమిషనర్లు, గ్రామస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నవోదయ విద్యాలయాలు దేశంలో అత్యుత్తమ



నివాస పాఠశాలలుగా గుర్తింపు పొందాయని, ఇక్కడ ఉచిత విద్య, వసతి, భోజనం, సీబీఎస్ఈ సిలబస్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఇది జీవితాన్ని మలిచే అరుదైన అవకాశమని పేర్కొన్నారు. జేఎన్‌వీఎస్‌టీ--2027కు ఆన్‌లైన్ దరఖాస్తులు జూలై 2 నుంచి ప్రారంభమయ్యాయి. జూలై 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబర్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డీపీఓ జగదీశ్వర్, మున్సిపల్ కమిషనర్లు, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కై ఏఐటీయూసీ పోరాటాలు




**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌ను అమలు చేయడం ఉద్యోగ, కార్మిక వర్గానికి వ్యతిరేకమని ఏఐటీయూసీ జిల్లా సమితి ఐదవ మహాసభలో తీర్మానించారు. గణేష్‌నగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన మహాసభలో, ఈ కోడ్స్ రద్దు అయ్యేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని ఏఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ స్థాపన, ప్రమాద బీమా, పెన్షన్ సౌకర్యం, కనీస వేతనాల అమలు వంటి డిమాండ్లపై భవిష్య త్తులో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయిం చారు. జిల్లా నూతన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షు లుగా కాసేట్టి లక్ష్మయ్య, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షులుగా జంగా తిరుపతి యాదవ్, బెజ్జంకి కాళిదాస్, కిమ్మసారపు శ్రీనివాస్, వెల్దండి దామోదర్, ప్రధాన కార్య దర్శిగా టేకుమల సమ్మయ్య, సహా యక కార్యదర్శులుగా పిట్టల సమ్మయ్య, డి. రజిత, పిట్టల శ్రీనివాస్, కే. రజిత, కదారి బీరయ్య, కోశాధికారిగా చిట్ల నిఖిల్‌తో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# ఘనంగా చెస్ టోర్నీ కరపత్రం ఆవిష్కరణ

**ఎలిగేడు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈనెల 18, 19 తేదీలలో కరీంనగర్‌లోని వీ వీ కన్వెన్షన్ ఈసీ హాల్లో జరగనున్న 4వ ఆల్ ఇండియా ఓపెన్ మరియు జూనియర్స్ చెస్ పోటీలు కరపత్రాలను మంగళవారం ఎలిగేడు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, "చదరంగం ఆటతో మేధాశక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ అలవాటు పడుతుంది. ఈ టోర్నమెంట్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. టోర్నీ ఆర్గనైజర్, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్,



సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ, "కరీంనగర్‌లోనే మొట్టమొదటిసారిగా రూ. 1,25,000 నగదు బహుమతులు, 100 మెమెంటోలు, చిన్నారులకు మెడల్స్ అందజేయనున్నాం. పాల్గొనే క్రీడాకారులు, తల్లిదండ్రులకు భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నాం" అని తెలిపారు. ఆసక్తి కలవారు 8341206989, 9160160161 నంబర్లను సంప్ర దించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముంజం నరేష్, మాజీ ఉప సర్పంచ్ గుడుగుల మహేందర్, వార్డు సభ్యులు మామిడాల రమేష్, విద్యా కమిటీ మాజీ చైర్మన్ అడ్డగుంట తిరుపతి గౌడ్, జిల్లా డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ కార్యదర్శులు కంకటి సృజన్ కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, నాయకులు దగ్గుల శ్రీనివాస్, కోట శ్రీకాంత్, అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్, కట్ల ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై ఐక్య ఉద్యమం

**హైదరాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు మరియు విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఐక్య పోరాటం నిర్వహించాలని యుయస్పీసి స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. మంగళవారం టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో టిటిఎ అధ్యక్షుడు ఎస్. హరికృష్ణ అధ్యక్షత వహి ంచారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25ను సవరించాలని, పిఒ 2018 ప్రకారం సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ



చేయాలని కమిటీ డిమాండ్ చేసింది. టెట్‌లో సర్వీసు వెయిటేజ్ ఇవ్వాలని, సబ్జెక్టు వారీ పేపర్లతో ప్రత్యేక టెట్ నిర్వహించాలని, బిసి, గిరిజన గురుకులాల టైమ్‌టేబుల్ మార్చాలని, మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని సమావేశం తీర్మానించింది. అలాగే, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, 5 వాయిదాల డిఎను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదికను తెప్పించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమావేశంలో యుయస్పీసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎ. వెంకట్ (టిఎస్ యుటిఎఫ్), సిహెచ్. అనిల్ కుమార్, ఎన్. తిరుపతి (టిపిటిఎఫ్), ఎం. సోమయ్య, టి. లింగారెడ్డి (డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), యానం విజయకుమార్, ఇటికాల రవీందర్ (ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం), బి. కొండయ్య (ఎంఎస్‌టిఎఫ్), లక్ష్మణ్ (టిటిఎ), రవీందర్, లక్ష్మయ్య యాదవ్ (టిపిటిఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

బుధవారం,
జూలై 15, 2026

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# చెట్టుపై నుంచి పడి జేఎల్ఎం గాయాలు



**ఖానాపూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని పాత తర్లపాడులో విద్యుత్ శాఖ జూనియర్ లైన్మెన్ ఎల్లాబాయ్ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్ ప్రధాన లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి చెట్టు ఎక్కిన సమయంలో జారి పడడంతో ఆయన తలకు గాయమై చెవుల నుంచి రక్తస్రావం జరిగింది. అదనంగా ఎడమ కాలు విరిగినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, ప్రథమ చికిత్స అనంతరం ఎల్లాబాయ్‌ను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

# పిచ్చి మొక్కల తొలగిస్తున్న వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్



**ఖానాపూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్ పిచ్చి మొక్కలు, గడ్డి, ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలను జెసిబి సహాయంతో తొలగింపజేశారు. డ్రైనేజీల శుభ్రత పనులను పర్యవేక్షించిన ఆయన, ప్రతి ఇంటి ముందు నీరు నిలవకుండా, గడ్డి పెరగకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటిస్తే దోమల నివారణ సాధ్యమవుతుందని, జ్వరాలు వంటి వ్యాధులు రాకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కాలనీ వాసులతో తెలిపారు.

# ఎస్ఐఆర్ సహాయక కేంద్రానికి విశేష స్పందన



**ఖానాపూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ 11వ వార్డులో బీజేపీ సీనియర్ నాయకుడు ఎనగందుల నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఐఆర్ సహాయక కేంద్రం నిర్వహించారు. ఎన్నికల కేంద్రం ఇచ్చిన గడువు ముగుస్తున్నందున ఓటర్లకు సౌకర్యం కల్పించేందుకు రెండవ రోజు సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు నారాయణ తెలిపారు. రెండు రోజుల్లో 250 ఎస్ఐఆర్ ఫారాలు నింపి ఆన్‌లైన్ చేయడం జరిగిందని చెప్పారు. ప్రతి ఓటరు తమకు ఇచ్చిన ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని, లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, అందుకు తాము 24 గంటలు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, బీఎల్ఏలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొని సేవలు అందించారు.

# ఘనంగా బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**మానకొండూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూరు మండల కేంద్రంలోని పద్మావతి కళ్యాణ మండపంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం, శక్తి కేంద్రాలు, బూత్ కమిటీలను మరింత బలపరచడం, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ చేపట్టడం వంటి అంశాలపై నాయకులు దిశానిర్దేశం చేశారు. రాబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చిస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, ఓబీసీ మోర్చా నాయ కులు అప్పని తిరుపతి, మియపురం లక్ష్మణచారి, శీలం కుమార్, బాషబోయిన ప్రదీప్ యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అవుదారి విజయతో పాటు మండల మోర్చా అధ్యక్షులు, శక్తి కేం( దాల ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి

**- సర్పంచ్ అజెయ్ వర్మ**



**గన్నేరువరం, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజెయ్ వర్మ గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నిధులు లేక అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని, ఉన్న కొద్దిపాటి జనరల్ ఫండ్ లేదా 15వ ఫైనాన్స్ నిధులను విద్యుత్ బిల్లులకే వినియోగించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆయన విమర్శించారు. అప్పులలో ఉన్న పంచాయతీలను ఇబ్బంది పెట్టడం తగదని, కొత్తగా ఎన్నికైన సర్పంచులు అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. విద్యుత్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి గ్రామపంచాయతీలను ఆదుకోవాలని, లేనిపక్షంలో సర్పంచుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకాలు చేపడతామని హెచ్చరించారు.

# ఇసుక క్వారీపై గ్రామస్థుల ఆందోళన



**కరీంనగర్ రూరల్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామ పరిధిలో జరుగుతున్న ఇసుక క్వారీ కార్యకలాపాలను రద్దు చేయాలని గ్రామస్థులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. క్వారీ వల్ల వెలువడుతున్న ధూళి కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారని, వందలాది లారీలు తిరగడంతో రోడ్లు పాడై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల వ్యవసాయం, తాగునీటికి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా క్వారీ కొనసాగుతోందని ఆరోపించారు. స్థానికుల ఆరోగ్యం, జీవనోపాధి దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీ వద్దే బైఠాయించి నినా దాలు చేసిన గ్రామస్థుల ఆందోళనతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఈ నిరసనలో మహిళలు, వృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నమస్తే పథకం కింద పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ



**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నమస్తే పథకం కింద పారిశుద్ధ్య వ్యర్థాల సేకరణ కార్మికులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ టి. మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్హులైన కార్మికులకు ఆరోగ్య భద్రత, విధి నిర్వహణలో రక్షణ కల్పించే సదుపాయాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమని, వారి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీ బాధ్యతగా కొనసాగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, పిల్లి తిరుపతి, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, గాదేపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, కో-ఆప్షన్ సభ్యులు ఎండి హసన్, భూక్య సరోజన, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతాంగాన్ని కాపాడాలంటే కన్నేపల్లి నుంచి నీరు ఎత్తిపొయ్యాలని డిమాండ్




**హుజురాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉత్తర తెలంగాణ రైతాంగాన్ని కాపాడాలంటే వెంటనే కన్నేపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని హుజు రాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నప్పటికీ రైతులకు అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని ఆయన విమర్శించారు. రాజకీయాలు పక్కనబెట్టి వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరిన ఆయన, బ్యారేజీలకు నష్టం జరిగినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పూర్తి బాధ్యత తీసుకుంటారని, అవసరమైతే రాజీనామా చేయడానికి సిద్ధమని తెలిపారు. మక్కజొన్న రైతులకు చెల్లింపులు పూర్తిగా జరగకపోవడం అన్యాయమని, దీనిపై ప్రభుత్వం వెంటనే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగునీటితో పాటు భవిష్యత్తులో తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించి, రైతుల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముటా గోపాల్ పాల్గొన్నారు

# ఘనంగా జరిగిన గోరింటాకు సంబరాలు



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆదర్శనగర్‌లో ఓం సాయి మహిళా కిట్టి అధ్యక్షురాలు నలమాచు రాణి ఆధ్వర్యంలో సభ్యులు కలిసి గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. సభ్యులు ఒకరికొకరు చేతుల నిండా గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా నలమాచు రాణి మాట్లాడుతూ గోరింటాకు అందానికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతుందని, శరీరానికి చల్లదనం, జుట్టు ఆరోగ్యం, చర్మ సంరక్షణకు సహాయపడుతుందని తెలిపారు. ఎల్లంకి రజిత మాట్లాడుతూ కిట్టి సభ్యులు ప్రతి నెల ఒకరి ఇంట్లో కలుసుకుని సేవా కార్యక్రమాలు చేపడతారని, 15 ఏళ్లుగా ఒకరికి ఒకరు తోడుగా ఉన్నామని చెప్పారు. అక్కినపల్లి శివ జ్యోతి మాట్లాడుతూ గోరింటాకు లక్ష్మీదేవికి ఇష్టమైనదిగా భావించి శ్రావణమాసం, వరలక్ష్మీ వ్రతం, నాగపంచమి, రాఖీ పౌర్ణమి వంటి పండుగల సందర్భంగా ధరించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నలమాచు రాణి, ఎల్లంకి రజిత, అక్కినపల్లి శివ జ్యోతి, ఎల్లంకి పద్మ, నాగమల్ల లత, పాత భాగ్యశ్రీ, జిల్లా కరుణ, చంద్రకళ, నీలిమ, కళ్యాణి, సునంద, శ్రీలత, లావణ్య, భాగ్యలక్ష్మి, శ్రావణి, మాధవి, జయ, స్వాతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం యోగా గురు రాళ్ల బండి శంకర ప్రసాద్ రెడ్డి రచించిన నిత్య ఆరాధన స్తోత్ర మాల గ్రంథాన్ని సభ్యులకు అందజేశారు.

# విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారానికి చర్యలు



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భగత్‌నగర్ కాలనీలో దీర్ఘకాలంగా ఇబ్బందులు కలిగిస్తున్న విద్యుత్ స్తంభం సమస్యపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తక్షణమే స్పందించారు. కాలనీ నివాసులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, సునీల్ రావు స్వయంగా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా వెంటనే స్తంభం సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై తక్షణ స్పందనతో చర్యలు తీసుకున్నందుకు కాలనీ నివాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక



**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నూతన మండల కమిటీ ఎన్నికలు ఘనంగా జరిగాయి. మండలంలోని 18 గ్రామాల ప్రతినిధులు పాల్గొని ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ నిర్వహించి 32 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాధారపు సంపత్ అధ్యక్షుడిగా, దోకిడి తిరుపతి ప్రధాన కార్యదర్శిగా, సుద్దాల రాజేందర్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, కార్మికుల ఐక్యతతో మండల కమిటీ ఏర్పడిందని, సంక్షేమ పథకాలు అందేలా నూతన కమిటీ ముందుండి పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు, కార్డుల రెన్యువల్, పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, ఇండ్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జూలై 20న జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కార్మికులను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, నూతన కమిటీ సభ్యులు, 18 గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక




**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) కరీంనగర్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోలోజు రంజిత్, కార్యదర్శిగా బ్రాహ్మణపల్లి యుగంధర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కసి బోసుల సంతోష్ చారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మ్యాకల రమ్య, మచ్చ రమేష్, సహాయ కార్యదర్శులుగా కాల్వ శ్రీనివాస్ యాదవ్, చెంచల మురళి, కోశాధికారిగా చెంచల రవి బాధ్యతలు స్వీకరించారు. అదనంగా 25 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర మాట్లాడుతూ, జిల్లాలో యువజన సంఘాన్ని గ్రామస్థాయిలో బలోపేతం చేసి యువత హక్కుల సాధన కోసం కదిలించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి, ఖాళీ ఉద్యోగాల భర్తీ, యువత కోసం ప్రత్యేక కేంద్రాలు, కోచింగ్ సెంటర్లు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు ఏర్పాటు కోసం పోరాటాలు చేపట్టాలని ఆయన సూచించారు.

# పిహెచ్‌సీలలో మెరుగైన వైద్యం అందించాలి - కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి డాక్టర్లను ఆదేశించారు. మంగళవారం పుల్లూరు గ్రామంలోని పిహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, ఓపి మెయింటెనెన్స్, మెడిసిన్ అందుబాటు, సమయపాలన వంటి అంశాలను పరిశీలించారు. వృద్ధులను పలకరిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని, పెద్ద సమస్యలుంటే జిల్లా జీజీఎచ్‌కి వెళ్లాలని సూచించారు. ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి అనవసరంగా డబ్బులు ఖర్చు చేయకుండా ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని, పిహెచ్‌సీ పరిసరాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# పెన్షనర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్




**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ సర్వసభ్య సమావేశంలో పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందేలా హెల్త్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం హెల్త్ చెకప్ తప్పనిసరి చేయాలని, భార్యాభర్తలలో ఒకరి నుండే హెల్త్ ప్రీమియం మినహాయింపు ఉండాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు మంజూరు చేసి, పిఆర్సీ అమలు చేయాలని ఆయన కోరారు. అధికంగా ప్రీమియం డిడక్ట్ అయిన వారికి ఎస్టీవో ద్వారా సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంఘం ఇచ్చే పిలుపులకు ప్రతిస్పందించి పోరాటాల్లో పాల్గొనాలని ఆయన సభ్యులను కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, 150 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
బుధవారం,
జూలై 15, 2026


# కాళేశ్వరం రైతుల పాలిట శాపమైందని కాంగ్రెస్ విమర్శలు




**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో టిఆర్ఎస్ ప్రభుత్వం నాసిరకం పనులు చేసి లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టి రైతులను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరామ్ సాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ రైతులకు నీరు అందిస్తున్నాయని, కానీ కాళేశ్వరం మాత్రం సాంకేతిక లోపాలతో రైతుల పాలిట శాపమైందని అన్నారు.కేటీఆర్ రైతులపై మాట్లాడే నైతిక హక్కు కోల్పోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఉచిత కరెంటు, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ వ్యభిచారం చేస్తున్న కేటీఆర్ ప్రవర్తనను కాంగ్రెస్ సహించదని హెచ్చరించారు.

# బిల్డర్ అసోసియేషన్ బంద్‌పై సీఐటీయూ విమర్శ




**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం బంద్ చేపట్టామని చెప్పిన బిల్డర్ అసోసియేషన్ నిజానికి బీజేపీ నాయకుల మెప్పు కోసం చర్యలు తీసుకుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ ఆరోపించారు. నగరంలో జరిగిన ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని పరిశీలిస్తే బీజేపీ మేయర్, డిప్యూటీ మేయర్ హాజరై కార్మికుల సమస్యలపై సూద్దాపూస మాటలు మాట్లాడారని ఆయన విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్‌లో విలీనం చేసిన చరిత్ర బీజేపీదేనని, కార్మిక హక్కులను హరించిందని అన్నారు. సీఐటీయూ మరియు ఇతర కార్మిక సంఘాలు ఎన్నో పోరాటాలు చేసినా బిల్డర్ అసోసియేషన్ ఎప్పుడూ కార్మికుల కోసం ఆందోళన చేయలేదని, ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా బంద్ చేస్తున్నారని ఆరోపించారు.కార్మికులు మేల్కొని బీజేపీ మోసపూరిత వైఖరిని ఖండించాలని, జూలై 20న జరగనున్న జిల్లా కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# బోనస్ పొందాలంటే ఆన్లైన్ తప్పనిసరి

**ఖానాపూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం ప్రకటించిన బోనస్ పొందాలంటే రైతులు కొనుగోలు చేసిన వరి వంగడాలను తప్పనిసరిగా ఆన్లైన్‌లో నమోదు చేయాలని వ్యవసాయ అధికారి జగదీశ్వర్ తెలిపారు. బిపిటి-5204 (సాంబార్ వసూరి), ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూ జి ఎల్-44, జేఎన్ఎం-7715 వంటి ఏడు రకాల సన్నాల వరి వంగడాలను ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు చేసిన తర్వాత పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో అనుసంధానం చేసి ఆన్లైన్ నమోదు చేయాలని సూచించారు.ఆన్లైన్ నమోదు చేసిన రైతులకే బోనస్ లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ఆర్మీ వాహనాలపై టోల్ వివాదం




**తిమ్మాపూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజీవ్ రహదారి రేణిగుంట టోల్ ప్లాజా వద్ద ఆర్మీ వాహనాలకు టోల్ కట్టాలని డిమాండ్ చేయడంతో మంగళవారం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.ఆర్మీ వాహనాలకు దేశవ్యాప్తంగా టోల్ మినహాయింపు ఉన్నప్పటికీ, టోల్ ప్లాజా సిబ్బంది టోల్ కట్టాల్సిందేనని పట్టుబట్టడంతో కంటైనర్లు నిలిచిపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఆర్మీ అధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ టోల్ చెల్లించేది లేదని స్పష్టం చేశారు. చివరికి తిమ్మాపూర్ పోలీసులు జోక్యం చేసుకుని టోల్ ప్లాజా సిబ్బందితో మాట్లాడి ఆర్మీ వాహనాలను పంపించడంతో ట్రాఫిక్ క్రమంగా సర్దుకుంది.ప్రయాణికులు టోల్ ప్లాజా సిబ్బంది ధనార్జన ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కుమ్మరి కుంటలో అక్రమ మట్టి తవ్వకాలపై డీఈకు వినతి



**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ శివారు మహమ్మదాపూర్ రోడ్డులోగల కుమ్మరి కుంటలో ప్రభుత్వ అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.సర్వే నంబర్ 81లో ఉన్న కుమ్మరి కుంటలో ఆక్రమణలు జరుగుతున్నాయని, హద్దులు నిర్ణయించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన కోరారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తున్నారని ఆరోపిస్తూ, అక్రమ రవాణాను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాజకీయ అండతో అక్రమ తవ్వకాలు కొనసాగితే నిరంతరం ఫిర్యాదులు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుతాటి భాస్కర్, గుగులోతు తిరుపతి నాయక్, జెరిపోతుల రమేష్, కొనేటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోమాత సేవ



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమావాస్య సందర్భంగా వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో పితృదేవతల అనుగ్రహార్థం గోమాత సేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.క్లబ్ అధ్యక్షుడు జిల్లా జగదీష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పచ్చి గడ్డి, పండ్లు, ఆహార పదార్థాలను సమర్పించారు. భక్తులు తమ పితృదేవతల పేర్లతో గోమాత సేవ చేసి ఆశీర్వాదాలు పొందారు.జగదీష్ మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో గోమాతకు విశిష్ట స్థానం ఉందని, గోసేవ ద్వారా కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతుందని తెలిపారు. సమాజంలో ధార్మిక చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సామా లక్ష్మణ్, నమశివాయ, పోచమల్ల విజయ్, పైడా రవి, పెద్ది రఘు, సుధాకర్, దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ క్లబ్ అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

# భూముల రీ సర్వేకు అందరూ సహకరించాలి




**- ఆర్డీవో గంగయ్య**

**ఎలిగేడు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భూముల రీ సర్వేలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య పిలుపునిచ్చారు. ఎలిగేడు మండలం లోని లోకపేట గ్రామంలో గ్రామ సరిహద్దులు, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, పట్టా భూములపై రీ సర్వే అంశంపై గ్రామసభ జరిగింది.ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ, “రీ సర్వే విధానం పారదర్శకంగా జరుగుతుంది. గ్రామస్థులకు ఉన్న అపోహలను తొలగించాలి. భూముల రికార్డులు సక్రమంగా ఉండటం భవిష్యత్తులో వివాదాలను నివారిస్తుంది” అని వివరించారు.కార్యక్రమంలో పెద్దపల్లి డీఐ, తహసీల్దార్ యాకన్న, సర్పంచ్ రాధ గంగా జమున, ఆర్ఐ విజయలక్ష్మి, మండల సర్వేయర్ అస్మ, చైర్మన్ రజనీకాంత్, జీపీవో సదానందం, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచిన ఉన్నత పాఠశాల విద్యార్థిని



**ఖానాపూర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాల మస్కాపూర్ విద్యార్థిని విజ్ఞత రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించింది.సూర్యాపేట జిల్లా కోదాడలో జూలై 12న జరిగిన అస్మిత కేలో ఇండియా ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్-1లో విజ్ఞత ఐదవ స్థానం సాధించినట్లు ప్రధాన ఉపాధ్యాయులు జాడి శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థిని, ఆమె తండ్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాడి శ్రీనివాస్, షేక్ ఇమామ్, అంజయ్య, శేఖర్, షఫీ, విజయ్, శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# నల్లా కనెక్షన్ల జాప్యంపై మేయర్ హెచ్చరికలు



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లా కనెక్షన్ల మంజూరు, ఫీజుల వసూళ్లలో జరుగుతున్న ఆలస్యం, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై పత్రికా కథనాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్ తీవ్రంగా పరిగణించారు. మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సమీక్ష నిర్వహించిన ఆయన, పెండింగ్ దరఖాస్తులు, ఫీజుల వసూళ్లు, ప్రజల ఫిర్యాదులపై అధికారులను ప్రశ్నించారు. నిర్ణీత గడువులోనే కనెక్షన్లు మంజూరు చేయాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదని ఆదేశించారు. ప్రక్రియపై ఆకస్మిక తనిఖీలు జరుపుతామని, నిర్లక్ష్యం వహించినా లేదా అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఈఈ లచ్చిరెడ్డి, డీఈలు శ్రీనివాస్, ఓం ప్రకాష్, వెంకటేశ్వర్లు, ఏఈలు, ఫిట్టర్లు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో బంగారు పతకం సాధించిన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని




**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని ఈ. అన్విత రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో బంగారు పతకం సాధించింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడం ద్వారా సమాజంలో ఉత్తమ స్థానాలు సాధించవచ్చని అన్నారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయడంలో ఎస్ఐపి సంస్థ విజయవంతమైందని, అన్విత సాధించిన విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.అన్వితకు బంగారు పతకం, ప్రశంసా పత్రం, ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పది టాపర్లకు నగదు అందజేత



**ఎలిగేడు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ధూళికట్ట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బుద్దినేని సత్యనారాయణరావు ప్రతి యేటా పది టాపర్లకు నగదు బహుమతులు అందజేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.ఈ ఏడాది మార్చిలో జరిగిన పరీక్షల్లో ఎర్ర నందిని 513 మార్కులతో ప్రథమ స్థానం, భూసారపు శ్రీకృష్ణమల్లా గౌడ్ 507, కంది వరుణ్ సాయి 507 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. మొదటి స్థానం పొందిన విద్యార్థినికి రూ.2,000, రెండవ స్థానం పొందిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున నగదు అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ కొమురయ్య, హెచ్ఎం బిజిలి సదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం




**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు విమర్శించారు.కలెక్టరేట్ ఎదుట తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు హాజరైన ఆయన, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ వంటి కీలక సమస్యలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేకపోవడం దురదృష్టకరమని, ప్రజా మరియు ఉద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, స్పష్టమైన కాలపరిమితిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు తిరుపతి రావు, ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నూతన డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



**గంగాధర, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 2026--27 విద్యా సంవత్సరంలో గంగాధరలో ప్రారంభమైన నూతన డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు ప్రవేశాలు లభించనున్నాయి. ప్రస్తుతం ఈ కళాశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించబడుతోంది.మంగళవారం కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, తగిన వసతులు కల్పించి వెంటనే డిగ్రీ తరగతులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సమీప ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో ఏర్పాటైన కళాశాల భవిష్యత్తులో ఇతర కళాశాలలకు పోటీగా నిలవాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. పనులను చిన్న భాగాలుగా విభజించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు.నిర్మాణ పరిసరాలను పరిశీలిస్తూ సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణు గోపాల్, ఈఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిండి ఎబివిపి ఆధ్వర్యంలో కళాశాల బంద్ విజయవంతం



**దేవరకొండ, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిండి మండలంలో ఎబివిపి శాఖ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ విజయవంతంగా జరిగింది. విద్యార్థుల స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎబివిపి నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎబివిపి డిండి శాఖ నాయకుడు బాధమోని సాయి గౌడ్ మాట్లాడుతూ, “తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం కుట్ర పన్నుతూ ఈ పథకాన్ని నిర్లక్ష్యంగా అమలు చేస్తోంది. రూ.11 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి” అని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యశ్వంత్, చందు, సాయి గౌడ్, అంజి, అభిలాష్, పాసివ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో మేయర్ సూచనలు



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రెండవ డివిజన్ తీగలగుట్టపల్లె ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఓటరు సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన బూత్ స్థాయి అధికారులకు ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా, అనర్హుల పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.ప్రజలకు ఓటరు నమోదు, చిరునామా సవరణ తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ గ్రీవెన్స్ డే సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని వినతి

కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రతి నెల రెండవ మంగళవారం నిర్వహించే గ్రీవెన్స్ డే సందర్భంగా కరీంనగర్ రీజియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో రీజినల్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రీజియన్ కార్యదర్శి వి. శ్రీనివాస్ మాట్లాడుతూ, 21 సమస్యలపై వినతిపత్రం ఇచ్చామని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కారం కానట్లయితే రీజినల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రీజియన్ అధ్యక్షుడు రాపల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడు పి. రవి, సహాయ కార్యదర్శి కే. స్వామి, రెండవ డిపో కార్యదర్శి సంపత్, మొదటి డిపో అధ్యక్షుడు కె. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలాండ్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**రామగుండం, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామగుండం నియోజకవర్గాన్ని మరింత అందంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిపాదిత ఐలాండ్ నిర్మాణానికి స్థలాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పరిశీలించారు. ఏ-పవర్ హౌస్ సర్కిల్ వద్ద స్థానిక పరిస్థితులను పరిశీలించిన ఆయన, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఐలాండ్‌ను ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన మొబైల్ ఫోన్ల అప్పగింత



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా గుర్తించిన రూ.12 లక్షల విలువైన 31 మొబైల్ ఫోన్లను బాధితులకు కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి పాల్గొని బాధితులకు మొబైల్ ఫోన్లను అందజేశారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే ఫోన్లను గుర్తించి తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి చేసిన వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# 4వ ఆల్ ఇండియా ఓపెన్ జూనియర్ చెస్ చాంపియన్షిప్ పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్షిప్--2026 వాల్ పోస్టర్‌ను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ మేధో వికాసానికి దోహదపడే క్రీడ అని, ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు యువ క్రీడాకారులకు ప్రతిభను ప్రదర్శించే మంచి అవకాశం కల్పిస్తాయని అన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొంటారని, విజేతలకు రూ.1,25,000 నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నాగరాజు, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, నిర్వాహకులు సృజన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.ం

# ఇంటింటి ఓటరు సర్వే విజయవంతం



**అమ్రాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండలం కల్ములోని పల్లి, తెలుగు పల్లి గ్రామాల్లో 320వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఇంటింటి ప్రత్యేక ఓటరు సర్వే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు జరిగిన ఈ సర్వేలో బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాలను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కూడా సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారి శ్యామ్ సుందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోరటి నిరంజన్, మాజీ మండల పరిషత్ సభ్యుడు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు కల్ముల మనోహర్, దాసరి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్‌బండ్ పనులు వేగవంతం చేయాలి ముున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ



**సుల్తానాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆశీస్సులతో సుల్తానాబాద్ పట్టణంలోని ఊర చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల పురోగతిని ఆరా తీశారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవీందర్, 7వ వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి టీపీటీఎఫ్



**హైదరాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును తెలంగాణ సచివాలయంలో కలిసింది. శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం ఉపాధ్యాయుల సమస్యలపై ప్రాతినిధ్యం చేసింది. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, "2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, నూతన ఆరోగ్య పథకం మార్గదర్శకాలను రూపొందించి ఉద్యోగులకు వెంటనే హెల్త్ కార్డులు ఇవ్వాలి. పెండింగ్ డీఏలను విడుదల చేసి, పిఆర్సీని ప్రకటించి అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించాలని, మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీలను విద్యాశాఖలో విలీనం చేసి టీచర్లకు నూతన ఆరోగ్య పథకం వర్తింపజేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాలని, అన్ని యాజమాన్యాల్లో ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రాతినిధ్యం చేసిన వారిలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యం. లక్ష్మయ్య యాదవ్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల బాలయ్య పాల్గొన్నారు.

# నీట్-2026 పేపర్ లీకేజీ మోడీ ప్రభుత్వ ఘోర వైఫల్యం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి.
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**దేవరకొండ జూలై 14.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాల ఆశలను మోస్తున్న నీట్-2026 పరీక్ష మరోసారి అవినీతి, నిర్లక్ష్యం, కోచింగ్ మాఫియా -- అధికార యంత్రాంగం కుమ్మక్కు కారణంగా విద్యార్థుల శాపంగా మారిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండిపడింది. నీట్ పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో దేవరకొండ లోకోదాడఉజద్బర్ల జాతీయ రహదారి పై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ నీట్-2026 పరీక్షలో పేపర్ లీకేజీ, భారీ అక్రమాలు వెలుగులోకి రావడం మోడీ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నేడు అంధకారంలో పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో జరిగిన పేపర్ లీక్ ఘటనపై అప్పట్లోనే కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే నేడు ఇంత పెద్ద స్కాండల్ పునరావృతమైందని, పరీక్షా వ్యవస్థను కేంద్రం కోచింగ్ మాఫియాకు, కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ)ను రద్దు చేయాలని లేదా పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. నీట్-2026 పరీక్షను వెంటనే రద్దు చేసి, ఎటువంటి అదనపు ఫీజులు లేకుండా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ జరిపి పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని కోరారు. లీకేజీకి కారణమైన అధికారులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాను వెంటనే అరెస్ట్ చేయాలని, నష్టపోయిన విద్యార్థులకు మానసిక, ఆర్థిక పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, రాష్ట్రాలకు తమ స్వంత ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే హక్కును కల్పించాలని, విద్యను కార్పొరేట్ వ్యాపారంగా మార్చే విధానాలను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. కాక్రోక్ జనతా పార్టీ గత కొన్ని రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరవధిక దీక్ష చేపట్టిన కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం శానిటేషన్ పనులను నిలిపివేసి, వాటరు, కరెంటు సౌకర్యాలు లేకుండా, కనీసం నిరసన కోసం వేసుకున్న టెంట్లను ప్రయోగిస్తూ నిరాహార దీక్ష చేస్తున్న నాయకుల పాడవుతున్న కనీసం కేంద్ర ప్రభుత్వం స్పందించట్లేదని, వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. పరీక్షల రద్దుతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.జైరాం, సబావత్ వినోద్, ఎం .నాగరాజు, కే. మహేష్, ఏ.శివ. ఎల్.అశోక్, భరత్, కార్తీక్, అభిషేక్, గోపి, జయంత్, గోవిందా రాజ్, శ్రీధర్, ప్రవీణ్, సందీప్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఓటర్ ఎన్యుమరేషన్ ను పరిశీలించిన మండల బూత్ ఇంచార్జ్ సురేష్

- ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాలు నింపివ్వడం త్వరితగతిన పూర్తయ్యేలాచూడాలి
- ఓటు మన ప్రాథమిక హక్కు నమోదు చేసుకోవడం మన బాధ్యత.



**దేవరకొండ జూలై 14.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కొండమల్లేపల్లిమండల పరిధిలోని పలు గ్రామాల్లో ఓటర్ ఎన్యుమరేషన్ (ఓటరు నమోదు) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ నమోదు ప్రక్రియను దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సూచన మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కొండ మల్లెపల్లి మండల పలు బూత్ ల ఇంచార్జ్ యేకుల సురేష్ వివిధ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఇందులో భాగంగా చెన్నమనేని గ్రామ పంచాయతీ పరిధిలోని స్థానిక పోలింగ్ బూత్‌ను ఆయన సందర్శించి, రిజిస్ట్రేషన్ పనుల పురోగతిని, పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాలను ప్రజలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. స్వయంగా రంగంలోకి దిగి పలు ఎన్యుమరేషన్ ఫారాలను నింపడంలో ప్రజలకు సహాయం చేస్తూ, సకాలంలో వివరాలను నమోదు చేసుకునేలా ప్రోత్సహించారు. ఓటరు నమోదులో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ బాధ్యతని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ శ్రీపతి, ఆయనతో పాటు జీపీఓ అమర్, పంచాయతీ సెక్రెటరీ చిలుముల విజయ్, బిఎల్ఓ రేణుక, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనయ్య, బిఎల్ఏ మరియు పలువురు స్థానిక సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# స్కాలర్షిప్పు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- డా. చింతపల్లి శ్రీనివాస్ గౌడ్



**దేవరకొండ, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు సంఘీభావంగా దేవరకొండ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. డిండి రోడ్డులోని మీనాక్షి సెంటర్ నుండి కోర్టు మీదుగా వందలాది మంది విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.10,500 కోట్ల స్కాలర్షిప్పు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే కుట్రలను అడ్డుకుంటాం" అని హెచ్చరించారు. ప్రభుత్వం విద్యార్థులను రోడ్లపైకి నెట్టే పరిస్థితి తీసుకువచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అన్ని కార్యక్రమాలకు నిధులు ఉంటాయి కానీ పేద, బడుగు బలహీన విద్యార్థుల చదువుకు మాత్రం నిధులు కేటాయించడం లేదు. దశలవారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయాలనే కుట్రను అడ్డుకుంటాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, భీమగాని శివ గౌడ్, అప్పం వీరయ్య, పున్న బిక్షమయ్య, కాటం వెంకటేష్ గౌడ్, ఆడారపు గణేష్, ఆకారపు గౌతమ్, నాగపల్లి సుధాకర్, రామావత్ రాము, ఆంజనేయులు, వింజమూరు వెంకటేశ్వర్లు, లిఖిత, దీపక్, చిన్న నాయక్, శాంతి రాజు, రామావత్ పాండు నాయక్, వర్త్య రమేష్ తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలి సిఐటియు



**నల్లగొండ, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే ఆలోచన విధానాన్ని మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం డిమాండ్ చేశారు. మంగళవారం ఎలక్ట్రిసిటీ ఉద్యోగ కార్మికుల సమస్యలపై రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలను ఎస్ఈ కార్యాలయం, ఎలక్ట్రిసిటీ స్టోర్లలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ, "2003లో వాజ్‌పాయ్ ప్రభుత్వం విద్యుత్ చట్టం తెచ్చింది. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం దాన్ని వేగవంతం చేస్తూ విద్యుత్ సవరణ బిల్లు--2022ను ప్రవేశపెట్టింది. ఇప్పుడు 2025 బిల్లుగా అమల్లోకి తెస్తోంది. ఈ చర్యలన్నీ విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు దారితీస్తున్నాయి" అని ఆరోపించారు. ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 17న ఉపముఖ్యమంత్రి సమక్షంలో హామీలు ఇచ్చినా, 68 రోజులు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని ఆయన తీవ్రంగా ఖండించారు. "వేతన ఒప్పంద గడువు ముగిసి రెండు నెలలు దాటింది. ఆలస్యం చేయకుండా 2026 పిఆర్సీని నియమించి వేతన ఒప్పందం అమల్లోకి తేవాలి. పెన్షనర్లతో కలిపి 70 వేల కుటుంబాలకు ప్రయోజనం కలిగే ఈ అంశంపై అన్ని కార్మిక సంఘాలు జోక్యం చేసుకోవాలి" అని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు, ఇంజనీర్లతో సహా ఐక్య పోరాటాలకు ముందుకు రావాలని, లబ్ధిదారులకు వాస్తవాలు తెలియజేసి వారిని సమీకరించి పోరాటాల ద్వారానే సంస్థను కాపాడుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ స్టోర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కత్తుల యాదయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు జంజరాల శ్రీనివాస్, సలివోజు సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
బుధవారం, జూలై 15, 2026



# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై వెల్దండలో బిఆర్ఎస్ ఫిర్యాదు



**వెల్దండ, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెల్దండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట రామ్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా పుట్ట రామ్ రెడ్డి మాట్లాడుతూ, "రైతులను హింసకు ప్రేరేపించేలా, ఆత్మహత్యలకు ఉసిగొలిపేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతలు, రైతుల రక్తాన్ని పొలాల్లో చిందించాలనే వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు. బండరాయి కట్టుకొని ప్రాజెక్టులో దూకాలని చెప్పడం ఆత్మహత్యకు ప్రేరేపించడం అవుతుంది. ఇలాంటి వ్యాఖ్యలు రాజకీయ విమర్శల కిందకు రావు, ముమ్మాటికీ నేరం" అని ఆరోపించారు. భారతీయ అన్యాయ సహిత 2023 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సీఎం పై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి, మాజీ ఎంపిటిసి జ్యోతి నిరంజన్, మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, పోతేపల్లి సర్పంచ్ కొండల్ యాదవ్, మాజీ ఎంపిటిసి నాగుల నాయక్, మాజీ ఎంపిటిసి లింగం, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, పోలే అశోక్, జంగిలి ప్రవీణ్, జంగిలి దాస్, శ్రావణ్ కుమార్, భాస్కర్, రాజు, గణేష్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రమౌళి, మల్లేష్, ఎం.డి. అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి మల్లు రవి సేవలు స్ఫూర్తి మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి జన్మదిన వేడుకలు ఆమనగల్లులో కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం లతో కలిసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న నాయకుడు డాక్టర్ మల్లు రవి అని కొనియాడారు. పార్లమెంట్‌తో పాటు అన్ని వేదికలపై ప్రజల గొంతుకగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ పార్టీ అభివృద్ధికి మార్గదర్శకుడిగా కొనసాగుతున్న మల్లు రవి సేవలు ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడు మల్లు రవి అని అన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మానయ్య, సీనియర్ నాయకులు ధనంజయ, మాజీ మండల అధ్యక్షుడు తెల్లమల్ల జగన్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, పర్వతాలు, కాలే మల్లయ్య,




సేవాదళ్ అధ్యక్షుడు దశరథ్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, ఎంగలి ప్రసాద్, పూసల సత్యం, మైసయ్య, తల్లోజు రామకృష్ణ, కండె సాయి, కొండల్ రెడ్డి, అబ్దుల్ అలీం, సురేష్ నాయక్, ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, జలాల్, ఉపసర్పంచ్లు విజయ్ రాథోడ్, సురేష్ నాయక్, నాజర్, రాఘవేందర్, కుమార్ గౌడ్, హరిలాల్, శివ, బాలు, లక్ష్మణ్, నిరంజన్, వెంకటయ్య, శేఖర్, శీను, గోపాల్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ప్రజలందరూ ఎస్ఐఆర్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్ పిలుపు

**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆమనగల్లు ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి అర్హుడూ ఓటరు జాబితాలో తన పేరు నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. పేరు నమోదు కాకపోయినా, వివరాల్లో మార్పులు, చేర్పులు లేదా తొలగింపులు అవసరమైనా సంబంధిత ఫారాలను పూర్తి చేసి బీఎల్ఓలకు వెంటనే అందజేయాలని తెలిపారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా దరఖాస్తులను త్వరితగతిన సమర్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి పౌరుడు తన ఓటును పరిరక్షించుకునే బాధ్యతతో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మానయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ మండల అధ్యక్షుడు తెల్లమల్ల జగన్,



కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, ఎంగలి ప్రసాద్, మాజీ వార్డు సభ్యుడు పూసల సత్యం, అబ్దుల్ అలీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, శేఖర్ గౌడ్, కొండల్ రెడ్డి, కుమార్ గౌడ్, జలాల్, శివ, సురేష్ నాయక్, శీను నాయక్, మహేష్, నాజర్, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఏబీవీపీ ఆందోళన

- ఆమనగల్లులో కళాశాల బంద్ విజయవంతం..
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ నాయకులు

**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆమనగల్లు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన కళాశాల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి చెన్నంశెట్టి మల్లేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నప్పటికీ ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో



భారీగా బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏడాది వేలాది మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, అనేక మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు, అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు పురుగుల శివ, రాష్ట్ర నాయకులు లండం మల్లేష్, కోట్ర సురేష్, గోపిగిరి నరేష్ గౌడ్, వల్లభదాసు శివ, నేనావత్ సుమన్ నా యక్, ప్రశాంత్, నవీన్, శివ, అఖిల్, జగదీష్ తదితర ఏబీవీపీ నాయకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం



**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోతారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్, డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టి, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి రెడ్డి, ఎంఈఓ బండారి మనీల, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

**సుల్తానాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మున్సిపాలిటీ 7వ వార్డులో పారిశుధ్యం, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, ప్రమాదకరంగా మారిన చెట్ల తొలగింపు, విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలు చేపడుతున్నట్లు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్ తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే చెట్లను తొలగిస్తున్నామని చెప్పారు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖతో సమన్వయం చేసి మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు.



# చేనేత ఐక్యవేదిక చైర్మన్‌గా చింతకింది శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక రాష్ట్ర సలహా మండలి చైర్మన్‌గా నియమితులైన చింతకింది శ్రీనివాస్‌కు హుస్నాబాద్ పట్టణ పద్మశాలి సంఘం, శ్రీ శివభక్త మార్కండేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఆలయ ప్రాంగణంలో జరిగిన అభినందన సభలో ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధి, నేతకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ తనపై విశ్వాసం ఉంచి బాధ్యత అప్పగించారని కృతజ్ఞతలు తెలిపారు. చేనేత రంగంలో యువతను ఆకర్షించడం, ప్రభుత్వ పథకాలను నేతకారులకు చేరవేయడం, క్షేత్రస్థాయి సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంలో బాధ్యతాయుతంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గాజుల భగవాన్ నేత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డేపల్లి వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు, కుల పెద్దలు, చేనేత నాయకులు, కార్మికులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్ బైక్‌కు నిప్పంటించిన దుండగులు



**హుస్నాబాద్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామ ఉపసర్పంచ్ ఏడబోయిన స్వరన్ కుమార్ మోటార్ సైకిల్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. జూలై 13 రాత్రి ఇంటి వద్ద పార్క్ చేసిన బైక్ పెట్రోల్ ట్యాంక్ మూతను తెరిచి నిప్పంటించడంతో వాహనం పాక్షికంగా దగ్ధమై నష్టం వాటిల్లింది. ఇటీవల బావి దగ్గర స్టార్టర్ దొంగిలించిన ఘటన కూడా జరిగినట్లు ఆయన తెలిపారు. వరుస ఘటనలు తనను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నాయని, ప్రాణహాని ఉందని స్వరన్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామ ప్రజలు కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాప్రతినిధుల భద్రతకు విఘాతం కలిగించే ఇలాంటి ఘటనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీని పటిష్టం చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

# వ్యాక్సిన్ ద్వారా నివారించే వ్యాధులపై శిక్షణ



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయంలో వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులపై ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్యాధికారి డా. శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, అనుమానిత కేసులను సకాలంలో నివేదించడం, సర్వైలెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించవచ్చని అధికారులు సూచించారు. డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డా. రాజగోపాల్ రావు, శిశు వైద్య నిపుణుడు డా. మహమ్మద్ షుజాయత్, మెడికల్ ఆఫీసర్ డా. మనోహర్ చమన్‌పల్లి వనరుల వ్యక్తులుగా పాల్గొని కేసుల గుర్తింపు, నమూనాల సేకరణ, నివేదికల సమర్పణ, వ్యాధి నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యాధికారులు, సూపర్వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొని సర్వైలెన్స్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సూచనలు పొందారు.

## మల్లు రవికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆమనగల్లు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు, శాలువాతో డాక్టర్ మల్లు రవిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మల్లు రవికి శుభాకాంక్షలు తెలిపిన గుర్రం కేశవులు



**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి జన్మదినం సందర్భంగా ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు మంగళవారం హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలమాల, శాలువాతో డాక్టర్ మల్లు రవిని ఘనంగా సత్కరించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని గుర్రం కేశవులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు బిక్కుమండ్ల రమేష్ గుప్తాతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.?

## నకిలీ ఓట్లపై చర్యలు తీసుకోవాలి

- తహశీల్దార్‌కు విజయ్ రాథోడ్ వినతి



**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటరు జాబితా పరిశుభ్రతను కాపాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అర్హత లేని ఓటర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజయ్ రాథోడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమనగల్లు మండల తహశీల్దార్ ఫహీం ఖాద్రిను కలిసి వినతిపత్రం సమర్పించారు. వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా నుంచి వలస వచ్చిన దిలీప్ కుటుంబ సభ్యుల పేర్లు స్థానిక ఓటరు జాబితాలో నమోదయ్యాయని పేర్కొంటూ వాటిపై సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం తొలగించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత వ్యక్తుల పూర్తి వివరాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను తహశీల్దార్‌కు సమర్పించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా, ఓటరు జాబితాలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ఎన్నికల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని విజయ్ రాథోడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలి

**- వస్పుల జంగయ్య**



**ఆమనగల్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలం వెంకట్రావుపేట్ గ్రామానికి ఇటీవల సర్పంచ్‌గా ఎన్నికైన ఇమ్మడి మహేష్‌ను మంగళవారం ఆమనగల్ మున్సిపాలిటీ కేంద్రంలో హైదరాబాద్ టెలికాం బోర్డు డైరెక్టర్ వస్పుల జంగయ్య ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వస్పుల జంగయ్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అభివృద్ధికి యువ నాయకత్వం ఎంతో అవసరమని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందించడంతో పాటు గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ మహేష్‌కు సూచించారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ సేవాభావంతో పనిచేస్తే ప్రజల మన్ననలు పొందవచ్చని పేర్కొన్నారు. సర్పంచ్ పదవి ప్రజాసేవకు లభించిన గొప్ప అవకాశమని, దానిని సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన సర్పంచ్ ఇమ్మడి మహేష్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వెంకట్రావుపేట్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంచందర్, పురుషోత్తం, మైసయ్య, రాములు, శంకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి అండగా ఉంటా..

**- టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**
**- సాలార్పూర్ తండా శివరామాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**కడ్తల్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలని, వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కడ్తల్ మండలం సాలార్పూర్ తండాలో నిర్మాణంలో ఉన్న శ్రీ శివరామాంజనేయ స్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశమై నిర్మాణ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు కేంద్రబిందువుగా నిలిచే ఈ ఆలయం ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధితో పాటు దేవాలయాల అభివృద్ధికి కూడా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజానికి ఉపయోగపడే ప్రతి మంచి కార్యక్రమానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొంటూ శ్రీ శివరామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హామీపై గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన సేవాభావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రియా రమేష్, ఉప సర్పంచ్ మహేశ్వరి కుమార్, స్వామీజీ భోజన్ మహారాజ్, ఆలయ కమిటీ చైర్మన్ జగన్, మాజీ సర్పంచ్ విజయశంకర్, సీనియర్ నాయకులు మోహన్, పంతు నాయక్, తౌర్య నాయక్, దస్రు, ప్రేమ్ కుమార్, పకీర, బాబా, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు

# వర్షాభావంతో విలవిల్లాడుతున్న రైతన్న

**- ఆమనగల్లు మండలంలో ఎండిపోతున్న పత్తి, జొన్న పంటలు..**
**- ఆకాశం వైపు ఆశగా రైతుల చూపులు**



**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాలు కురవకపోవడంతో ఆమనగల్లు మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా పత్తి, జొన్న పంటలను సాగు చేసిన రైతులకు ప్రస్తుతం వర్షాభావం పెద్ద సవాలుగా మారింది. పలు గ్రామాల్లో పత్తి, జొన్న పంటలు నీటి కొరతతో ఎదుగుదల కోల్పోయి వాడిపోతుండటంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సాగు ప్రారంభించిన రైతులు పెట్టుబడులు కూడా తిరిగి వస్తాయో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి మొక్కలు ఎండిపోతుండగా, జొన్న పంట కూడా నీటి లేమితో బలహీనంగా మారింది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వర్షాభావం మరింత భారంగా మారిందని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే పరిస్థితిని సమీక్షించి రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. రానున్న రోజుల్లో మంచి వర్షాలు కురిసి పంటలు గట్టెక్కాలని ఆమనగల్లు మండల రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఎస్ఐఆర్ విజయమే లక్ష్యం.. బీఎల్ఏలకు జైపాల్ దిశానిర్దేశం



**ఆమనగల్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక బాధ్యతతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని కళ్యాణి గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బీఎల్ఏల సమీక్ష సమావేశానికి గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి రజిని సాయిచంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి బీఎల్ఏ అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. అనర్హుల పేర్లను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యంతరాలు నమోదు చేయాలని తెలిపారు. బూత్‌ల వారీగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎస్ఐఆర్ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా అమలయ్యేలా ప్రతి బీఎల్ఏ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేస్తే ఓటరు జాబితా మరింత కచ్చితత్వంతో సిద్ధమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, వస్పుల సాయిలు, సైదులు గౌడ్, మాజీ ఎంపీపీ సి.ఎల్. శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ విజితా రెడ్డి, సర్పంచులు శ్రీను నాయక్, సత్యం, నాయకులు రమేష్ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, వడ్డేమోని శివకుమార్, చలిచీమల సతీష్, జంతుక కిరణ్, లండం యాదయ్య, ఎంగలి యాదగిరి, జంతుక అల్లాజీ, పంతు నాయక్, డోలియా నాయక్, మీసాల చిక్కి, కాలే వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

**- దారమోని గణేష్**



**కల్వకుర్తి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడిచినా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందకపోవడం పట్ల బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ పేద విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి పుస్తకాలు, దుస్తులు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు" అని ఆయన విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో అర్హతలేని ఉపాధ్యాయులను నియమించడం, సురక్షిత ప్రమాణాలు లేని బస్సులు నడపడం విద్యార్థుల ప్రాణాలకు ముప్పు అని గణేష్ ఆరోపించారు. "ప్రభుత్వం వెంటనే వసతులు కల్పించి, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించాలి. లేనిపక్షంలో సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ గౌడ్, శేఖర్ గౌడ్, రామకృష్ణ, పెరుమాళ్ళ కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## నిర్వహణ పనుల కారణంగా నేడు విద్యుత్ అంతరాయం



**కరీంనగర్, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూలై 15న కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో లైన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 11 కేవీ కాపువాడ ఫీడర్ పరిధిలోని కాపువాడ, మారుతీనగర్, చౌరస్తా, అశోక్‌నగర్, అహ్మద్‌పురా, పాత బజార్, మంగలి వాడ, శివాలయం, బొమ్మకల్ చౌరస్తా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడుతుంది. ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు 11 కేవీ గోదాం గడ్డ ఫీడర్ పరిధిలోని సప్తగిరి హిల్స్, తాహెరా మసీదు, సంతోషిమాత ఆలయం, శ్రీనగర్, భవానీ కాలనీ, మల్లికార్జున కాలనీ, జానకి వీధి, అపార్ట్‌మెంట్లు, అంజనాద్రి దేవాలయం, ధోబీ ఘాట్, గోదాం గడ్డ, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, జెడ్పీ క్వార్టర్స్, భగత్ నగర్, మల్లమ్మ మార్కెట్, రఘుపతి రెడ్డి హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. అలాగే ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని మార్కండేయనగర్, పద్మనగర్, ఇండస్ట్రియల్ ఏరియా, ప్రగతి నగర్, లారెల్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయబడుతుంది. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నియోజకవర్గ ఆశాజ్యోతి బైరెడ్డి శేషశయనారెడ్డి

**- 10వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**



**నందికొట్కూరు (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు నియోజకవర్గ ప్రజల ఆరాధ్య నాయకుడు, నీటిముంపు బాధితుల ఆశాజ్యోతి, విశాలాంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి శేషశయనారెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. వైసీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఘన నివాళులు అర్పిస్తూ, "బైరెడ్డి కుటుంబానికి ఆరాధ్య దైవం మహనీయుడు శేషశయనారెడ్డి. ఆయన త్యాగాలు, ప్రజల పట్ల అంకితభావం ప్రతి రాజకీయ నాయకుడికి ఆదర్శం. నియోజకవర్గ ప్రజలకు అండగా నిలవడం ఆయన చూపిన మార్గం" అని పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి మంత్రి బాధ్యతలు చేపట్టిన ఏకైక ప్రజా నాయకుడు శేషశయనారెడ్డి అని గుర్తుచేస్తూ, "అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి విశేష సేవలు అందించిన ఘనత ఆయనకే దక్కింది" అని సిద్ధార్థ రెడ్డి అన్నారు.

# "వర్షాల కోసం ఎదురుచూపులే మిగిలాయి.."



"ఈసారి అప్పులు చేసి పత్తి, జొన్న పంటలు సాగు చేశాం. మొదట్లో కురిసిన వర్షాలకు పంటలు బాగానే మొలకెత్తాయి. కానీ ఆ తర్వాత వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. రోజూ ఆకాశం వైపు చూసే పరిస్థితి వచ్చింది. మరో వారం రోజుల్లో మంచి వర్షాలు పడకపోతే పంట పూర్తిగా దెబ్బతిం టుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు భరోసా కల్పించడంతో పాటు అవసరమైతే ఆర్థిక సహాయం అందించాలి. ప్రకృతి కరు ణిస్తేనే ఈ సీజన్‌లో రైతు గట్టెక్కే పరిస్థితి ఉంది."

■ ఆ వెంకటయ్య, రైతు (సింగంపల్లి, ఆమనగల్లు మండలం)

# ప్రత్యేక ఓటరు జాబితాపై అప్రమత్తత అవసరం

## – తల్లోజు ఆచారి



**కల్వకుర్తి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు తప్పకుండా నమోదు చేసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. వెల్దండ మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "జాబితాలో ఉన్న తప్పులను సరిచేసుకోవడం, కొత్తగా అర్హత పొందిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవడం, మరణించిన వారి పేర్లు తొలగించడం, వివరాల్లో మార్పులు చేసుకోవడం వంటి అంశాలపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి" అని సూచించారు. గ్రామ, బూత్ స్థాయిలో ప్రజలకు సహకరిస్తూ ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు అధికారులకు అవసరమైన వివరాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కురుమిద్దె యాదగిరి, సీనియర్ నాయకులు జంగయ్య యాదవ్, జూలూరి బాలస్వామి, రామస్వామి, సత్యనారాయణ, అంజన్ కుమార్, జిల్లా నాయకులు అందోజు శ్రీనివాస చారి, మండల ప్రధాన కార్యదర్శి కేశమోని జంగయ్య, కమటం రవికుమార్, పెద్దాపూర్ ఉపసర్పంచ్ ప్రసాద్, వార్డు సభ్యులు రేవల్లి రాజు, కేశమోని పూజ తదితరులు పాల్గొన్నారు.

# అద్దె వాహనాల బిల్లులు పెంచాలి



**కల్వకుర్తి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 2017 నుంచి అద్దె వాహనాల ఛార్జీలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నాగర్‌కర్నూల్ జిల్లా అద్దె వాహన యజమానుల సంఘం కలెక్టర్ హెమంత్ కేశవ్ పాటీల్కు వినతిపత్రం సమర్పించింది. జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ, "డీజిల్, విడిభాగాలు, ఇన్సూరెన్స్, డ్రైవర్ల వేతనాలు అన్నీ పెరిగినా బిల్లులు మాత్రం పాత రేట్లకే ఉన్నాయి. పైగా రెండు సంవత్సరాలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పరిస్థితి దయనీయంగా మారింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, "ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి ప్రభుత్వ శాఖలకు వాహనాల సేవలు నిలిపివేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, శంకర్, బాలరాజ్ గౌడ్, నరేందర్, సందీప్, రామకృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణ ఆత్మగౌరవానికి కొత్త బలం

– తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా ఆత్మగౌరవ ట్రస్ట్ చైర్మన్‌గా కానుగుల దశరథం..

– వైస్ చైర్మన్‌గా మహేశ్వరి సాయి



**ఆమనగల్లు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నాయి ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా ఆత్మగౌరవ ట్రస్ట్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ట్రస్ట్ చైర్మన్‌గా కానుగుల దశరథం, వైస్ చైర్మన్‌గా మహేశ్వరి సాయిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, సభ్యులుగా విజయ్ సాయి, సుదర్శన్, ప్రేమ దాస్, రామకృష్ణ, శ్రీను, రమేష్, అనసూయ, మహేశ్వరి, రాములులను నియమించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నాయి శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల ఆత్మగౌరవం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ట్రస్ట్ రాష్ట్రవ్యాప్తంగా సేవలను విస్తరించాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులు సంఘ బలోపేతంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తామని, నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేస్తామని తెలిపారు.

# ఓటర్ జాబితాలో అర్హులందరూ నమోదు కావాలి



## – గోలి శ్రీనివాస్ రెడ్డి

**కల్వకుర్తి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఓటర్ సవరణ (సర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పిలుపు నిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని శుభం గార్డెన్లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ఎవరూ జాబితా నుంచి తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించి ఎక్కువ మంది ఈ కార్యక్రమాన్ని వినియోగించుకునేలా కృషి చేయాలి" అని సూచించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు




**ఎలిగేడు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో ధర్నా నిర్వహించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్వీ నాయకులను ఎలిగేడు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. "వర్షం లేక నీళ్లు లేక పంటలు పండవు, బీఆర్ఎస్వీ నాయకుల రక్తం చల్లితే పంటలు పండుతాయి" అని సీఎం చేసిన వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేయడానికి ధర్నా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు నిర్ణయించగా, పోలీసు లు ముందుగానే చర్యలు తీసుకున్నారు. అరెస్టయిన వారిలో బాసంపల్లి వినోద్, పల్లె కార్తీక్, నక్క కార్తీక్, నల్ల మహేష్ తదితరులు ఉన్నారు.

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో పోలీసు సేవలు

## – జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్



**ఆత్మకూరు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా పోలీసు అధికారి సునీల్ షోరాణ్, ఐపీఎస్ మంగళవారం ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, లాకప్ గదులు, సిబ్బంది హాజరు, కేసు నమోదు రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ అనంతరం స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితి, గ్రామాల్లో పోలీసింగ్ విధానం వంటి అంశాలను సమీక్షించారు. "ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి" అని సూచించారు. తదుపరి జానాలగూడెం చెంచు గ్రామాన్ని స్వయంగా సందర్శించిన ఎస్పీ, గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో ఐకమత్య వాతావరణాన్ని కొనసాగిస్తూ ఎలాంటి గొడవలు, వివాదాలకు తావు ఇవ్వకుండా పరస్పర సహకారంతో జీవించాలని సూచించారు. పిల్లలకు విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రతి కుటుంబం కృషి చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే జిల్లా పోలీసు శాఖ యొక్క అత్యున్నత ప్రాధాన్యత. ప్రజలకు పోలీసు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుంది" అని స్పష్టం చేశారు.

# సీఎం వ్యాఖ్యలపై బిఆర్ఎస్ ఫిర్యాదు




**కల్వకుర్తి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, "ప్రతిపక్ష నేతలపై హింసను, ఆత్మహత్యలను ప్రేరేపించేలా సీఎం వ్యాఖ్యలు ఉండటం ప్రజాస్వామ్యానికి ముప్పు" అని ఆరోపించారు. సీఎం పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ వింగ్ అధ్యక్షుడు వట్టేపు కిషోర్, పట్టణ యూత్ వింగ్ అధ్యక్షుడు నక్క ప్రదీప్, నాయకులు నిరటి మల్లేష్, ముత్యాల రమేష్, శేఖర్, పరశురాములు, నరేష్, వట్టేపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారులకు ప్రమోషన్ ఆర్డర్లు ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే



**నందికొట్కూరు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పదోన్నతులు పొందిన అధికారులకు మంగళవారం ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య ముఖ్య అతిథిగా హాజరై, పదోన్నతి పొందిన అధికారులకు ప్రమోషన్ ఆర్డర్లను అందజేశారు. నందికొట్కూరు ఎక్సైజ్ ఎస్.ఐ.గా పనిచేసి డోన్ సి.ఐ.గా పదోన్నతి పొందిన జఫరుల్లా, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి కోడుమూరు ఎక్సైజ్ ఎస్.ఐ.గా పదోన్నతి పొందిన కృపవర కుమారికి ఎమ్మెల్యే శాలువా కప్పి, పూల బొకేలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "నందికొట్కూరు నియోజకవర్గంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉన్నత పదోన్నతులు సాధించిన ఎక్సైజ్ అధికారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం శర్మ, ఎక్సైజ్ సి.ఐ. రామాంజనేయులు, హెడ్ కానిస్టేబుళ్లు పద్మనాభం, శేఖరయ్యే నాయకుడు, కానిస్టేబుళ్లు శివన్న, సుధీర్ కుమార్, మధుసూధన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపో వద్ద కొణిదెల విద్యార్థుల ధర్నా



**నందికొట్కూరు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొణిదెల గ్రామానికి ప్రత్యేక విద్యార్థి బస్సు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నందికొట్కూరు పట్టణ ఆర్టీసీ డిపో వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య కార్యదర్శి దక్క కుమార్, ఆంధ్ర విద్యార్థి సంఘం కార్యదర్శి కె. నాగరాజు నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో విద్యార్థులు రాస్తారోకో చేశారు. కొణిదెల గ్రామం నుండి ప్రతిరోజూ దాదాపు 50 మంది విద్యార్థులు పట్టణానికి చదువుకోడానికి వస్తున్నారని, కానీ బస్సులు నిలిపివేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ, "నెహ్రూ నగర్ నుండి వచ్చే బస్సు మా గ్రామానికి చేరేసరికి పూర్తిగా నిండిపోతుంది. ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని పది రోజులుగా వినతిపత్రాలు ఇచ్చినా, పోలీసులకు చెప్పినా డిపో మేనేజర్ పట్టించుకోవడం లేదు. 'నేను బస్సు వెయ్యను, ఎవరికి చెప్పుకుంటే చెప్పుకోండి' అని నిర్లక్ష్యంగా స్పందిస్తున్నాడు" అని ఆరోపించారు. డిపో వద్ద రాస్తారోకో నిర్వహించిన విద్యార్థులు, ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి డిపో మేనేజర్‌తో మాట్లాడినా స్పందన లేకపోవడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "తక్షణమే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయకపోతే మండల తహసీల్దార్ కార్యాలయం, జిల్లా బీజేపీ ఆర్ఎస్ కార్యాలయానికి వెళ్తాం" అని విద్యార్థులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వకపోతే ఓటు గల్లంతు

## – కమిషనర్



**కల్వకుర్తి, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఓటరు సవరణ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించిన కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ పట్టణ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, "పట్టణంలో ఇప్పటి వరకు 55% మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజ్ అయ్యాయి. ఎవరికైనా డబుల్ ఓట్లు ఉన్నా, కుటుంబ సభ్యులు మరణించినా, లేదా తమ ఓటు సొంత గ్రామంలో ఉంచుకోవాలనుకున్నా, సంబంధిత బిఎల్‌ఓలకు వివరాలు తప్పనిసరిగా అందజేయాలి. లేకపోతే మీ ఓటు గల్లంతవుతుంది" అని హెచ్చరించారు. ప్రజలందరూ ఓటు హక్కును తమ ప్రధాన హక్కుగా భావించి, ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఓలకు అందజేసి ఆన్లైన్‌లో నమోదు చేయించుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. "ప్రజల సహకారంతోనే ఓటరు జాబితా సవరణ విజయవంతం అవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు, జూలై 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నందికొట్కూరు మండల పరిధిలోని వడ్డమాను, బొల్లవరం గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.5,54,863 విలువైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే గిత్త జయసూర్య లబ్ధిదారులకు అందజేశారు. బొల్లవరం గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మీదేవికి రూ.20,000, జంగంపాడు శివనాయక్కు రూ.37,179, కోళ్ల బావాపురం దేగ దినేష్కు రూ.91,819, దామగట్ల బైరెడ్డి లలితమ్మకు రూ.2,13,916, వడ్డమాను బోయ రంగస్వామికి రూ.1,91,949 చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సీఎంఆర్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోంది. లబ్ధిదారులకు ఈ నిధి ద్వారా తక్షణ సహాయం అందించడం ప్రభుత్వం సంక్షేమపట్ల ఉన్న కట్టుబాటు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరప్రసాద్ రెడ్డి, నాయకులు సత్యం రెడ్డి, తిప్పారెడ్డి, సుందర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, టిడిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



బుధవారం, జూలై 15, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రిక






## వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్

రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్' . జి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ సినిమా జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో వేంకటేశ్వర స్వామిగా రాజేంద్రప్రసాద్ నటించగా.. భక్తుడిగా శ్రీకాంత్ కనిపించనున్నారు.

-------

## రావ్ బహద్దూర్ అందరూ చూడాల్సిన మూవీ

### ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా



ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బ్జడెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.

----------

## తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

### సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్



అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## తుంబాడ్-2 లో ఆలియా



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బ్జడెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



----

## తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం

### జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా




విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం.సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 'తెలుగు సినిమా.. హిందీ సినిమా' ఇదేం విభజన? - అడివి శేష్



భాషల ఆధారంగా సినిమాలను విభజించే విధానంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని హీరో అడివి శేష్ అభిప్రాయపడ్డాడు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలను ఒకే భాషకు పరిమితం చేయడం సరైన విధానం కాదన్నాడు. దేశమంతా ఆదరించే కథలకు భాష అడ్డంకిగా మారకూడదని అభిప్రాయపడ్డాడు.ఇప్పటికీ 'హిందీ సినిమా', 'తెలుగు సినిమా', 'తమిళ సినిమా' అంటూ వేర్వేరుగా పిలుస్తూనే, మరోవైపు 'పాన్ ఇండియా సినిమా' అనే పదాన్ని ఉపయోగించడం ఆసక్తికరంగా అనిపిస్తోందని శేష్ చెప్పాడు. ఒక సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచగలిగితే దాని గుర్తింపును భాషతో ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించాడు. కథలను భాషల గీతల్లో కాకుండా భారతీయ కథలుగా స్వీకరించినప్పుడే నిజమైన పాన్ ఇండియా సినిమా ఆవిష్కృతమవుతుందని అన్నాడు.

భాష అనేది భావాలను వ్యక్తీకరించే సాధనం మాత్రమేనని, అది ఎప్పుడూ పరిమితిగా మారకూడదని అడివి శేష్ పేర్కొన్నాడు. ఇప్పుడు ప్రేక్షకులు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయారని చెప్పాడు. మంచి కథ ఎక్కడి నుంచి వచ్చినా ఆదరిస్తున్నారని, ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టు సినీ పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఉందన్నాడు.సినీ సృష్టికర్తల బాధ్యత నిజాయతీతో కూడిన కథలను అందరికీ చేరేలా రూపొందించడమేనని శేష్ అన్నాడు. ఒక భాష మార్కెట్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా దేశం మొత్తం సొంతం చేసుకునే సినిమాలను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పాడు.ప్రస్తుతం అడివి శేష్ నటించిన 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. అలాగే 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2' చిత్రంలో కూడా అడివి శేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, వామికా, మధు శాలిని ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.